


‘సంక్షేమ’ జల్లు!

- రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వివిధ వర్గాలపై వరాల జల్లు
- మహిళలు, నాయీబ్రాహ్మణులు, చేనేత, కల్లుగీత కార్మికులకు బొనాంజా
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై పూర్తిస్థాయి స్పష్టత
- సెలూన్లకు ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంపుతో హర్షం
- చేనేత కార్మికులకు ఒకేసారి ఉచిత విద్యుత్, జీఎస్టీ చెల్లింపు, త్రిఫ్ట్ పథకాలు
- కొత్త బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు తెరుచుకునే ఛాన్స్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పలు కీలక నిర్ణయాలు ప్రకటించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు బడుగు, బలహీనవర్గాలకు ఆర్థికంగా మరింత తోడ్పాటునందించేలా వరాల జల్లు కురిపించింది. మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, నాయీబ్రాహ్మణులు ఇలా అనేక వర్గాలకు ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలను ప్రకటించింది. తద్వారా ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన అనేక హామీలు అమలుచేసేలా క్యాబినెట్ నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ఆగస్టు 15 నుంచి అమలుకానున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై మంత్రి మండలి పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చింది. మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడకు ఏయే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చనేదానిపై కీలక నిర్ణయాలు ప్రకటించింది. రాష్ట్రానికి చెందిన మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రకటించింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణానికి ప్రభుత్వం అనుమతించింది. ఉచిత సౌకర్యం వినియోగించుకునేందుకు ఆధార్, ఓటర్, రేషన్‌కార్డుల్లో ఏదొకటి చూపిస్తే చాలని స్పష్టత ఇచ్చింది. అలాగే ఉచిత బస్సు పథకం నాన్‌స్టాప్, అంతర్ రాష్ట్రీయ బస్సు సర్వీసులు, లేదా ఇతర ఏ కేటగిరీలకు వర్తించదని పేర్కొంది. పథకం అమలుకు నెలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.162 కోట్ల వరకు ఖర్చవుతుండగా, ఉమ్మడి జిల్లాలో రూ.16 కోట్ల వరకు ప్రభుత్వంపై భారం పడనుంది. మరోపక్క ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రద్దీ పెరగనున్నందున మహిళల భద్రత కోసం బస్సు లోపల సీసీ కెమెరాలు, మహిళా కండక్టర్లకు బాడీ వార్న్ కెమెరాలు ఇవ్వనున్నట్టు క్యాబినెట్ వెల్లడించింది. అందులో భాగంగా పథకం అమలుకోసం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో దాదాపు 600 బస్సులను సిద్ధం చేస్తున్నారు. అలాగే అన్ని బస్సు డిపోల్లో ప్రయాణికుల కోసం ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కూడా కల్పించడానికి క్యాబినెట్ నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో అనేక బస్టాండ్ల రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం హెయిర్ కటింగ్ సెలూన్లకు అమలవుతున్న 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు అయితే ప్రభుత్వం బొనాంజా ప్రకటించింది. ఒకేసారి మూడు పథకాలకు ఆమోదం తెలిపింది. మగ్గాలకు ఉచిత విద్యుత్, చేనేత విక్రయాలపై జీఎస్టీ రద్దు, త్రిఫ్ట్ ఫండ్ పథకం ప్రారంభించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ వల్ల ఉమ్మడి జిల్లాలో 6,548మందికి రూ.3.92కోట్ల లబ్ధిచేకూరనుంది. అలాగే చేనేత ఉత్పత్తులపై చెల్లించే జీఎస్టీని ప్రభుత్వం నేతన్నలకు తిరిగి చెల్లించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం నేతన్నల్లో సంతోషం మిన్నంటేలా చేస్తోంది. దీంతో కాకినాడ జిల్లాలో 23 సంఘాలకు రూ.12 లక్షలు, కోనసీమ, తూ.గో జిల్లాల్లో నేతన్నలకు రూ.75లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ఇక ఈనెలతో ముగియనున్న పాత బార్ లైసెన్సుల నేపథ్యంలో వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభం కానున్న కొత్త బార్లకు సంబంధించి విధివిధానాలను క్యాబినెట్ వెల్లడించింది. కొత్త బార్లు ఇకపై ఉదయం పది నుంచి రాత్రి 11వరకు తెరవడానికి అనుమతించింది. అలాగే కల్లుగీత కార్మికులకు బార్ ఫీజులో యాభై శాతం తగ్గింపుతో కల్లుగీత కార్మికులకు తీపి కబురు అందించింది.

ఆరో రోజు హోరాహోరీగా జాతీయ మహిళా హాకీ పోటీలు

7



కాకినాడలో హాకీ ఆడుతున్న మణిపూర్, అస్సాం జట్లు

చేనేత సొబగులు



- దారాలతో కళాఖండాల సృష్టి నేతన్నల సొంతం
- చేనేతలపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు
- చేనేత రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు నడుం బిగించిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడు చేనేత దినోత్సవం

6

ఆత్మలకు.. రేషన్



పంపన లక్ష్మి పేరున కార్డు యాక్టివేషన్లో ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపుతున్న చిత్రం

పేరు: పంపన లక్ష్మి, ఇంద్రపాలెం
అంత్యోదయ రేషన్‌కార్డు నెంబర్: వైఏపీ042300500460
నెలకు 35 కిలోల రేషన్ బియ్యం అందుతాయి.
మరణించిన తేదీ: 8.9.2015

అందరికీ దూరమై సుమారు పదేళ్లు కావొస్తున్నా.. ఆమె పేరున రేషన్ తీసుకుంటున్నట్టుగా రికార్డుల్లో నమోదవుతోంది. ఏప్రిల్ 15న 0423006 నెంబరు గల రేషన్‌షాపు నుంచి, మే 11న 0423034 నెంబర్ గల రేషన్ దుకాణం నుంచి, జూన్ 6న, గతనెల 0423034 నెంబరుగల రేషన్ దుకాణంనుంచి సరుకులు తీసుకున్నట్టు ఉంది.

పేరు: పాలెపు వీరమ్మ, వలసపాకల
అంత్యోదయ రేషన్‌కార్డు నెంబర్: వైఏపీ042302601039
నెలకు 35 కిలోల రేషన్ బియ్యం అందిస్తారు.
మరణించిన తేదీ: 7.1.2025

మరణించి 8నెలలైంది. అయినా ఆమె తనకు వచ్చే 35 కిలోల బియ్యం, రెండు కిలోల పంచదార రేషన్ తీసుకుంటోంది. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీన 0423006 నంబరు గల రేషన్ దుకాణం నుంచి, మే 11న 0423034 నంబరు గల రేషన్ దుకాణం నుంచి, అదే షాపు నుంచి జూన్ 10వ తేదీన బియ్యం, పంచదార సరుకులు అందుకున్నట్టుగా రికార్డుల్లో ఉంది.

పేరు: పోలవరపు వెంకయమ్మ, తూరంగి
అంత్యోదయ రేషన్ కార్డు నెంబర్: వైఏపీ042301100020
నెలకి 35 కిలోల బియ్యం, రెండు కిలోల పంచదార సరఫరా చేస్తారు.
మరణించిన తేదీ: 27.7.2024

మృతి చెంది ఏడాదైంది. అయినా నెలనెలా వచ్చే రేషన్ షాపులను తీసుకుంటోంది. ఏప్రిల్ 15న 0423006 నెంబరు గల రేషన్ దుకాణం నుంచి, మే 11వ తేదీన 0423034 నంబరు గల దుకాణం నుంచి, జూన్ 12వ తేదీన కూడా అదే నెలలో రేషన్ సరుకులు తీసుకుంది.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఇదేంటి..వీరందరూ మరణించారు... భూమ్మీదే లేరు. మరి వీరు ఎలా రేషన్ తీసుకుంటున్నారబ్బా!, కొంపదీసి ఆత్మలేమైనా వచ్చి వేలిముద్రలేసి సరుకులు తీసుకుపోతున్నాయా? లేకుంటే.. జంతర్‌మంతర్ మోళీ జరుగుతోందా? అసలు ఈ సరుకులు ఎవరు తీసుకుంటున్నారు? చనిపోయిన వారి పేరున ఎలా తీసుకుంటున్నారు? నిరుపేదలకు అందాల్సిన బియ్యాన్ని ‘బియ్యామ్.. బియ్యామ్’ అంటూ బొక్కేస్తున్నది ఎవరు? తెలుసుకోవాలని ఉందా? చదివేయండి మరి.. వితంతువులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నవారు, వికలాంగులు, 60ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సువారు,సంవత్సరాదాయం రూ.15వేలు ఉన్న వారందరికీ ప్రభుత్వం ఈ కార్డులు అందిస్తుంది. ఈ కార్డు ద్వారా వీరికి నెలకు 35 కిలోల ఉచిత బియ్యంతోపాటు రెండు కిలోల పంచదార వంటి నిత్యావసర వస్తువులు అందిస్తుంటారు. వీరిలో వితంతువులు, ఒంటరి మహిళలు అధికంగా ఉంటారు. కూటమి వచ్చాక ఇలాంటి వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 38వేల అంత్యోదయ అన్నయోజన కార్డుదారులున్నారు. వీరిలో వయసు మీరి కొందరు, అనారోగ్యంతో కొందరు మరణించారు.

బియ్యాన్ని బొక్కేస్తున్నారు

శవాలపై మరమరాలు ఏరుకునే బ్యాచ్ మాదిరిగా.. కాకినాడలో చనిపోయిన వారి అంత్యోదయ కార్డుదారుల పేర్లతో కొందరు నెలనెలా 35కిలోల బియ్యాన్ని బొక్కేస్తున్నట్టుగా తేలింది. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని పలువురు రేషన్‌డీలర్లు ఈ అక్రమాలకు పెద్దఎత్తున పాల్పడుతున్నట్టుగా వెలుగులోకి వచ్చింది. వీరికి కొందరు వీఆర్వోలు, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ సిబ్బంది సహకరిస్తున్నట్టుగా తెలుస్తోంది. కాకినాడ రూరల్ పరిధిలో అంత్యోదయ కార్డులు ఉన్న కొందరు వివిధ కారణాలతో కా లం చేశారు. వాస్తవానికివీరిలో ఎక్కువమంది ఒంటరి మహిళలే.. ఇలాంటి వారికార్డులను తమ వద్ద ఉంచుకుని కొందరు డీలర్లు నెలనెలా వారికి వచ్చే 35 కిలోల ఉచిత బియ్యాన్ని నొక్కేస్తున్నారు. ఈ తతంగం చాలారోజులుగా సాగుతోంది. ఇలాంటి కార్డులకు రేషన్ బియ్యం ఇవ్వాలంటే కచ్చితంగా వీఆర్‌ఓ లేదా సచివాలయ సిబ్బంది వేలిముద్రలు వేయాలి. అప్పుడే కార్డుదారుడి డేటా కనిపిస్తుంది. వేలిముద్ర, ఐరిష్ క్యాప్చరింగ్ కానిదే బియ్యపు గింజ కూడా బయటకు రాదు.

కొన్ని నెలలుగా..

రేషన్‌సరుకులు అర్హులకు మాత్రమే అందాలి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరుకుల పంపిణీలో గోల్‌మాల్ జరుగుతోంది. జిల్లాలో రేషన్ లబ్ధిదారుల్లో మృతులు ఉన్నారంటే ఆశ్చర్యం పడాల్సిన పరిస్థితే లేదు. ఇందులో ఈకేవైసీ ప్రక్రియను అధికారులు ప్రహసనంగా మార్చేశారు. ఇదే అవకాశంగా కొందరు డీలర్లు సరుకులను పక్కదారి పట్టిస్తున్నారు. అలాంటి సంఘటనలు కాకినాడ రూరల్ మండలంలోని కొన్ని షాపుల్లో అనేకం జరిగినట్టు ఆధారాలు బయటపడ్డాయి. సుమారు ఏడు నెలల నుంచి ఏడాది మధ్య కాలంలో మరణించిన పలువురు కార్డుదారుల పేరుతో కాకినాడ రూరల్ మండలంలోని షాపు నెం: 0423006, 0423034 నెంబర్లు గల రెండు రేషన్ దుకాణాల నుంచి చనిపోయిన వారి కార్డు నెంబర్లతో సరుకులు తీసుకువెళ్లినట్టుగా తేలింది. జిల్లాలోని కాకినాడ అర్బన్, పిఠాపురం, ఏలేశ్వరం, తాళ్లరేవు, రాజమండ్రి, గండేపల్లితోపాటు అనకాపల్లి జిల్లాకు చెందిన అంత్యోదయ కార్డు లబ్ధిదారులు సైతం ఈ రెండు రేషన్ షాపుల నుంచే నెలనెలా అందించే 35 కిలోల ఉచిత రేషన్ బియ్యాన్ని తీసుకువెళ్లడం విశేషం.

డీలర్ల పరేషాన్

- మరణించిన వారి పేరున రేషన్
- అంత్యోదయ అన్నయోజన కార్డుల్లో మాయాజాలం

అంతా అక్కడి నుంచేనా..

ఈ మొత్తం వ్యవహారంలో రేషన్ డీలర్లు, ఎంఎస్‌ఓలు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది ప్రమేయం కచ్చితంగా ఉండే అవకాశం ఉందంటున్నారు. వీరిందరూ ఓపక్క ప్రణాళికతోనే ఇలాంటి అక్రమ దందాలను, దోపిడీలను నిర్వహిస్తున్నట్టుగా అర్థమవుతోంది. జిల్లాలో 1060 రేషన్ దుకాణాలు ఉండగా.. అంత్యోదయ కార్డులు ఉండగా.. ఎక్కడో కాకినాడ రూరల్ మండలంలోని రెండు దుకాణాలకు మాత్రమే వచ్చి ఎందుకు సరుకులు తీసుకుంటున్నారో ఆ సివిల్ సప్లయీస్ అధికారులే నిగ్గుతేల్చాలి. ఈ బాగోతంలో ఆ విభాగానికి సంబంధించిన ఓకీలక ఉద్యోగికూడా చేతులు కలిపారనే ప్రచారం ఉంది. డీఎస్‌ఓ తర్వాత ఆ స్థాయిలో ఈ పోస్ మెషీన్ల పాస్‌వర్డ్‌లు తెలిసిన ఆ ఉద్యోగి ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉంటుందని అంటున్నారు. అతడే ఇలాంటి కార్డులన్నింటిని పోగేసి.. తమకు అనుకూలంగా ఉన్న డీలర్లకు అప్పగిస్తూ.. రేషన్ బియ్యం దోపిడీకి సహకరిస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇక్కడ మాత్రమే కాదు.. జిల్లా అంతటా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నక్యాంటీన్ నిర్మాణానికి నిధులు కేటాయించాలి

- ప్రతిపాదనలు పంపిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో అన్నక్యాంటీన్ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ప్రతిపాదనలు అమరావతికి పంపారు. కాకినాడ జీజీహెచ్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు పరిసర జిల్లాలనుంచినుంచి రోగులు నిత్యం వస్తుంటారు. ఈ నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా కాకినాడ జీజీహెచ్‌లో అన్న క్యాంటీన్ నిర్మించాలని కలెక్టర్ సంకల్పించారు. ఈ నేపథ్యంలో నిధులు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపారు.

పోలవరం ఎడమ కాలువ పనులు వేగవంతం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తునిమండలం కుమ్మరిలోవ సమీపంలో జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణపనులు వేగవంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. బుధవారం ఆయన కాకినాడలో ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. పోలవరం ఎడమ కాలువ ఇంకా 1.3 కిలోమీటర్ల మేరకు నిర్మించాల్సి ఉందన్నారు. దీనికి రూ.200కోట్లు వ్యయం అవుతుందన్నారు. ఈ కాలువ నిర్మాణం నేపథ్యంలో కుమ్మరిలోవలో ఇప్పటివరకు 482కుటుంబాలను ఖాళీ చేయించామన్నారు. నిర్వాసితులకు కుమ్మరిలోవ శివారు ప్రాంతంలో 12 ఎకరాల్లో, చేపూరు సమీపంలో మరో 12 ఎకరాల్లో ఇంటి స్థలాలను కేటాయించామన్నారు. మరో ఐదు కుటుంబాలను కుమ్మరిలోవనుంచి తరలించాల్సి ఉందన్నారు. వీరికి వసతికల్పనకు అధికారులు కసరత్తు చేస్తున్నారన్నారు. ఇక్కడ 60లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించి కాలువ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. తాండవ నదిపై నిర్మిస్తున్న అక్విడెక్ట్ నిర్మాణాలు ముగింపు దశకు వచ్చాయన్నారు. ఈనెలాఖరుకు పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. పోలవరం ఎడమకాలువ పనులకు ఉన్న ఆటంకాలను అన్నింటిని తొలగించామన్నారు. ప్రభుత్వం పోలవరం కాలువ నిర్మాణ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేస్తోందన్నారు.

యూఎస్ ఉమెన్‌కేర్ ఫెర్టిలిటీ క్లీనిక్‌పై చర్యలు

- షోకాజ్ నోటీసుకు స్పందించకపోవడంతో రిజిస్ట్రేషన్ సస్పెండ్ చేసిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు6(ఆంధ్ర జ్యోతి): కాకినాడలో నిర్వహిస్తున్న యూఎస్ ఉమెన్ కేర్, ఫెర్టిలిటీ క్లినిక్ అల్ట్రాసౌండ్‌పై కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం చర్యలు తీసుకున్నారు. షోకాజ్ నోటీసుకు స్పందించకపోవడంతో రిజిస్ట్రేషన్‌ను సస్పెండ్ చేస్తూ ఆయన ఉత్తర్వులిచ్చారు. హైదరాబాద్ సృష్టి ఐవీఎఫ్ సెంటర్‌కు అనుబంధ సంస్థగా కాకినాడలోని ఈ బ్రాంచ్‌కి డాక్టరు పి.నమ్రత డైరెక్టరుగా ఉన్నారు. ఈ క్లీనిక్ కార్యకలాపాలపై పీసీఅండ్ పీఎన్‌డీటీ కమిటీ సమీక్షించింది. కాకినాడ డైరీఫారానికి చెందిన దంపతులనుంచి ఈ క్లీనిక్ నిర్వాహకులు ఐవీఎఫ్ చికిత్స చేస్తామని రూ.6లక్షలు నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లచేశారు. ఈ నేపథ్యంలో ఈ దంపతులు డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో దీన్ని కమిటీ విచారణ చేసి యూఎస్ ఉమెన్ కేర్ ఫెర్టిలిటీ క్లీనిక్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనికి సమాధానం ఇవ్వకపోడం, క్లీనిక్‌ను మూసివేసి ఉంచడంతో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్,ఏపీపీఎంసీఈ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను 8వారాలపాటు కలెక్టర్ సస్పెండ్‌చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కమిటీకి ఆదేశాలిచ్చారు. ఈసంస్థ ఏఆర్‌టీ సరోగసీచట్టం కింద రిజిస్ట్రేషన్ పొందలేదని డీఎంహెచ్‌వో గుర్తించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబరు అప్రోప్రియేట్ అథారిటీ తనిఖీలకు అందుబాటులో లేకపోవడంతో చర్యలుతీసుకున్నారు.

ఏఆర్‌టీ, సరోగసీ చట్టం పటిష్టంగా అమలు చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు6(ఆంధ్ర జ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి మల్టీమెంబరు అప్రోప్రియేట్ అథారిటీ, పీసీపీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో ఏఆర్‌టీ, సరోగసీ, పీసీఅండ్ పీఎన్‌డీటీ చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆస్పత్రులు జిల్లా అప్రాప్రియేట్ అథారిటీవద్ద నమోదై చట్టంలో సూచనలు కచ్చితంగా పాటించాలన్నారు.లేనిపక్షంలో జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో ఆస్పత్రులుగానీ, డయాగ్నోస్టిక్ సెంటర్లుగానీ రిజిస్టర్ కాకుండా ఏఆర్‌టీ, సరోగసీ, పీసీ పీఎన్‌డీటీ కేంద్రాలను నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో పీసీఅండ్ పీఎన్‌డీటీ యాక్ట్ టోల్‌ఫ్రీ నెంబరు 1800-425-3365కు ఫిర్యాదు చేయాలన్నారు. ఐయూఐ ప్రొసీజర్లు కూడా ఏఆర్‌టీ యాక్ట్ 2021 లెవెల్ వన్‌లోకి వస్తాయని, ఈ ప్రొసీజర్లను రిజిస్టర్ కాకుండా నిర్వహిస్తే శిక్షార్హులేనని తెలిపారు. గూగుల్, వాట్సాప్, టెలీగ్రామ్,పోస్టర్, యూట్యూబ్, కరపత్రాలు, గోడపత్రికలు, హోర్డింగ్‌ల ద్వారా ఏఆర్‌టీ, సరోగసీ రిజిస్టర్ కాని సెంటర్లు ప్రకటనలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లాలో ఆస్పత్రియాజమాన్యం, డయాగ్నోస్టిక్‌సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్జేడీ, డీఈవోలకు వినతి

కాకినాడ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సెకండరీ విద్యా మండల విద్యాశాఖాధికారులు-2, జాబ్‌చార్ట్, అసంబద్ధ పనివేళలు, ఒకేసారి నాలుగైదు లక్ష్యాలు నిర్దేశించడం వంటి సమస్యలపై ప్రధానోపాధ్యాయుల సంఘం ఎంఈవోలు-2 పక్షాన బుధవారం పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణికి, డీఈవో పిల్లి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. మండల విద్యాశాఖాధికారులు-2 ఉద్యోగాలను సృష్టించినప్పటినుంచి జాబ్‌చార్ట్ విషయంలో స్పష్టత లేకపోవడం, దాన్ని అధికారులు అనుసరించకపోవడం జరుగుతోందన్నారు. పనివేళలుఅసంబద్ధంగా ఉంటున్నాయని, 2024-25కు గాను సెమ్-2 పుస్తకాల రవాణా ఛార్జీలు చెల్లించలేదన్నారు. జిల్లాలో ఏమండలానికీ పూర్తిస్థాయిలో పుస్తకాలు సరఫరా చేయలేదని 8, 9, 19 తేదీల్లో సెలవులు 11 నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు నిర్వహించేందుకు టైమ్‌టేబుల్ ఇచ్చారని, చాలామంది విద్యార్థులవద్ద పుస్తకాలు లేని పరిస్థితి నెలకొందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను ఉన్నత పాఠశాలలకు నేరుగా అందజేయాలని, ప్రాథమిక పాఠశాలలకు క్లస్టర్ పాఠశాలల ద్వారా అందజేయాలని కోరారు. విన్నవించినవారిలో ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కూర్మారావు, రవి, సత్యనారాయణ, శ్రీధర్, చినరాజు, రాధాకృష్ణ ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- కలెక్టర్ షాన్‌మోహన్
- జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం



లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఆడశిశు జననాలపట్ల వివక్షతను అరికట్టే చర్యల్లో భాగంగా జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్ష ల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధిత చట్టం అమలుపై జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆడశిశు జననాలపట్ల వివక్షతను అరికట్టేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 17 ప్రభుత్వ, 141 ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. అన్ని చోట్ల తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. గతజూలై నెలలో 27 ఆకస్మికతనిఖీలు, 13 ఆపరేషన్లు చేశామన్నారు.ఎవరైనాచట్టాన్నిఉల్లంఘిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 1800-425-3368లోగానీ, వాట్సాప్ నెంబరు 9494113365 కుగానీ సమాచారం అందజేయాలన్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే నిమిత్తం గోడపత్రికను ఆవిష్కరించారు.డీఎంహెచ్‌వో నరసింహ నాయక్, ఏఎస్పీ భాస్కర్‌రావు, డీసీహెచ్‌ఎస్ స్వప్న, డీఐవో సుబ్బరాజు, ఏపీపీ నాగబాబు, జీజీహెచ్ రేడియోలజీ అనురాధ పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్స్ బలోపేతానికి కృషి: డీఈవో

కాకినాడ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో 49అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్నాయని, వాటిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని డీఈవో పి.రమేష్ అన్నారు. కాకినాడ విద్యాశాఖ భవనంలోని సమగ్ర శిక్ష సమావేశ హాల్లో జిల్లాలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ కలిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇన్‌ఛార్జి ఉపాధ్యాయులతో జిల్లా సైన్స్‌అధికారి ఎం.శ్రీనివాసవినీల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ఈ ల్యాబ్‌లను సక్రమంగా వినియోగించి విద్యార్థులలో సృజనాత్మకశక్తిని వెలికితీయాలని సూచించారు. డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, కూర్మారావు, జిల్లా నోడల్ ఉపాధ్యాయుడు కళ్యాణచక్రవర్తి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమలు రూ.47కోట్ల నీటి బకాయిలు చెల్లించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): కాకినాడపరిధిలోని పరిశ్రమలు నీటి బకాయిలు రూ.47కోట్లు వెంటనే చెల్లించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నీటిబకాయిలు చెల్లించని పరిశ్రమల యాజమాన్యాలతో బుధవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 నుంచి పరిశ్రమలు నీటిని వాడుకుంటూ బకాయిలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము బకాయిలు మధ్యలో ఉన్న ఏజెన్సీకి చెల్లించామని పలువురు పరిశ్రమల ప్రతినిధులు బదులిచ్చారు.

రేపటినుంచి జిల్లాస్థాయి క్రీడా పోటీలు

- జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహణ

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏపీ) ఆదేశాల మేరకు హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఇందులో 10క్రీడాంశాలు అథ్లెటిక్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈపోటీలు జిల్లాస్థాయిలో 8నుంచి 10, జోనల్‌స్థాయిలో 11 నుంచి 14, రాష్ట్రస్థాయిలో 16 నుంచి 20 వరకు జరగనున్నాయని, జిల్లాలో క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంపికలు ఈ కింది విధంగా జరగనున్నాయని తెలిపారు.

8న జిల్లాక్రీడామైదానంలో హాకీ (పురుషులు, మహిళలు), 9న పీఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల క్రీడా ప్రాంగణంలో అథ్లెటిక్, వెయిట్‌లిఫ్టింగ్ ఎంపికలు ప్రారంభిస్తారు. అదేరోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఆర్చరీ, బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తారు. అదేరోజు కాకినాడ ఆఫీసర్స్ క్లబ్‌లో బ్యాడ్మింటన్ పురుషులు, మహిళలు(అండర్-19)పోటీలు జరగనుండగా బాస్కెట్‌బాల్ ఎంపికల తేదీ తర్వాత తెలియజేయనున్నారు.

అర్హతలు, పత్రాలు

జనన ధ్రువీకరణ పత్రం పంచాయతీ, మున్సిపాల్టీలనుంచి జారీ చేసిఉండాలి. బ్యాడ్మింటన్‌కి అండర్-19కి వయస్సు 14 ఏళ్లు పైబడి, 22 లోపల ఉండాలి.

ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, జోనల్‌స్థాయికి ఎంపికైన వారు బ్యాంక్ పాస్ బుక్ మొదటిపేజీ, ఫోన్‌పే లేదా గూగుల్‌పే నెంబర్ సమర్పించాలి. వివరాలకు 9985113210 నెంబర్‌ను సంప్రదించాలి. అభ్యర్థులు ఆయా తేదీల్లో ఉదయం 8గంటలకు హాజరుకావాలని తెలిపారు.

నకిలీ ఈపీఎఫ్ చలానాలపై అన్నవరంలో ఆర్జేసీ విచారణ

7

చేనేతలపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నేతన్నలపై వరాల జల్లు కురిపించింది. చేనేత మగ్గానికి 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ప్రకటించింది. నేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని ప్రభుత్వమే భరించాలని రాష్ట్ర సచివాలయంలో చేనేత శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షలోప్రకటించారు. దానికి తోడు కేంద్ర ప్రభుత్వం నేత కార్మికుల కోసం అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల థ్రిఫ్ట్ ఫండ్ నిధులను చేనేత కార్మికులకు అందించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నేత కార్మికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను పునరుద్ధరిస్తే చేనేత రంగం పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని నాయకులు చెప్తున్నారు. నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

నేతన్నల ఇంట విద్యుత్ వెలుగులు

కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. దాంతో నేతన్నల ఇంట ఉచిత విద్యుత్ వెలుగులు ప్రసరించనున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 54 చేనేత సహకార సంఘాల పరిధిలో 9745 మంది సభ్యులు ఉన్నారు. చంద్రబాబు ప్రభుత్వం చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనుంది. 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలకు సైతం వెసులుబాటు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో 6,545 మందికి రూ.3.29 కోట్ల ఉచిత విద్యుత్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 6,548 మంది చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందించేందుకు చేనేత, జౌళి శాఖ అధికారులు గుర్తించారు. వీరికి రూ.3.92 కోట్ల విలువైన ఉచిత విద్యుత్ అందించనున్నారు.

చేనేత సొబగులు

చేనేత వస్త్ర ధారణలో విదేశీ వనిత



రంగు రంగుల దారాలతో అద్భుత కళాఖండాలను అల్లుతూ చేనేత రంగాన్ని నిత్య నూతనంగా ఉంచేందుకు నేతన్నలు నిరంతరం శ్రమిస్తున్నారు. అపార ప్రతిభ, నైపుణ్యం నేతన్నల సొంతం. అగ్గిపెట్టెలో పట్టేటంత చీరను నేసింది.. అతుకులు లేకుండా జాతీయ పతాకాన్ని తయారు చేసింది, దేవతామూర్తులను సైతం చేనేత వస్త్రాలపై ఆవిష్కరించిన ఘనత నేత కార్మికులదే. అటువంటి చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది.







చేనేత చీర కట్టులో విద్యార్థిని

దారాలతో కళాఖండాల సృష్టి నేతన్నల సొంతం

చేనేత రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు నడుంబిగించిన రాష్ట్ర ప్రభుత్వం

నేడు జాతీయ చేనేత దినోత్సవం



(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

నేత కార్మికుల సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించేందుకు 2015 సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రకటించారు. అప్పటి నుంచి ప్రతిఏటా ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నాం. తొలుత చేనేత వస్త్రాలనే ఉద్యమానికి వారధిగా వినియోగించి విదేశీ వస్తువుల బహిష్కరణ ఉద్యమాన్ని బ్రిటీషు ప్రభుత్వ హయాంలో చేపట్టారు. అందుకే 119 ఏళ్ల క్రితం జరిగిన స్వదేశీ ఉద్యమానికి ప్రతీకగా అటువంటి చారిత్రక సందర్భాన్ని జాతీయ చేనేత దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

రాయితీ బకాయిల విడుదలతో చేనేత సంఘాలకు లబ్ధి

చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే కార్మికులకు సైతం ఎంతో లబ్ధి చేకూరుతుందని కార్మిక సంఘ నాయకులు చెప్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తానికి మాత్రమే పరిమితమై చేనేత కార్మికులకు, సంఘాలకు ఉపయుక్తమైన ఎన్నో పథకాలకు మంగళం పాడేసింది. దాంతో జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు 20 నుంచి 40 శాతం నూలు సబ్సిడీపై రూ.3.55 కోట్లు బకాయిలు ఉండగా 20 నుంచి 30 శాతం చేనేత వస్త్రాల రిబేటు పథకంలో రూ.2.81 కోట్లు బకాయిలున్నాయి. థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో రూ.81.20 లక్షలు, పావలా వడ్డీ రాయితీ కిందరూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటివ్ కింద రూ.3.40 కోట్లతో పాటు ఆప్కో చెల్లించాల్సిన బకాయిలు కోనసీమ జిల్లాకు రూ.వంద కోట్ల పైబడి ఉన్నాయి.

రూ.82 లక్షల మేర జీఎస్టీ లబ్ధి

చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీ భారాన్ని భరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రూ.82లక్షల మేర జీఎస్టీ లబ్ధి చేకూరనుంది. చేనేత సహకార సంఘాలు ఏటా రూ.20 లక్షలు టర్నోవర్ దాటితే జీఎస్టీ పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం ఆమొత్తాన్ని రూ.40లక్షలకు పెంచారు. ఇంచుమించు ఉమ్మడి జిల్లాలోని సంఘాలన్నీ జీఎస్టీ పరిధిలోకి వచ్చాయి. దాంతో సహకార సంఘాలు కొనుగోలు చేసిన చిలపనూలుపై 5 శాతం జీఎస్టీ భారం పడింది. కోనసీమ జిల్లాకు రూ.55లక్షలు, కాకినాడ జిల్లాకు రూ.12లక్షలు, తూర్పు గోదావరి జిల్లాకు రూ.15లక్షలు జీఎస్టీ మినహాయింపు లభించనుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించి చేనేత సంఘాలకు చెల్లించే ఏర్పాట్లు చేసింది.

రూ.65లక్షల థ్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చేనేత కార్మికుల ఖాతాలకు రూ.65లక్షలు మేర థ్రిఫ్ట్ ఫండ్ నిధులు జమకానున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా చేనేత కార్మికులు ఉండడంతో రూ.52లక్షలు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు రూ.13లక్షలు చొప్పున థ్రిఫ్ట్ ఫండ్ నిధులు మంజూరు అయ్యాయని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు కె.పెద్దిరాజు తెలిపారు. ఇప్పటికే ఆయా మొత్తాలను సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. థ్రిఫ్ట్ ఫండ్ పథకం కింద ఒక్కో కార్మికుడు రూ.8 చొప్పున నిల్వ చేసుకుంటే దానికి రూ.16చొప్పున ప్రభుత్వం జమచేసి రూ.24 చొప్పున అందిస్తుంది.

జిల్లా	సాధారణ మగ్గాలు	ఉచిత విద్యుత్ రాయితీ
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	3610	రూ.2.17 కోట్లు
కాకినాడ	2150	రూ.1.29 కోట్లు
తూర్పు గోదావరి	788	రూ.0.47 కోట్లు

పాత పథకాలను పునరుద్ధరించాలి

దొంతంశెట్టి సత్యప్రకాష్, లివరీ చేనేత సహకార సంఘాల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్



గతంలో టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను పునరుద్ధరించాలి. ప్రధానంగా పావలా వడ్డీ పథకం, నూలుపై సబ్సిడీ, 30శాతం రిబేటు విధానాన్ని కొనసాగించాలి. చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిపడ్డ మొత్తాలను తక్షణం విడుదల చేయాలి. తొమ్మిది నెలలుగా బకాయిలు విడుదల కాక చేనేత సహకార సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఆప్కోకు తక్షణం ఎన్నికలు నిర్వహించి సహకార సంఘాల నుంచి పూర్తిస్థాయిలో వస్త్ర ఉత్పత్తులు కొనుగోలు చేసి వెంటనే నిధులు విడుదల చేయాలి.

నేతన్నలకు హామీతో కూడిన ఉపాధి కల్పించాలి

చింతా శంకరమూర్తి, మాజీ జడ్పీటీసీ, బండారులంక



చేనేత కార్మికులకు హామీతో కూడిన ఉపాధి కల్పించాలి. గతంలో అమలుచేసిన జనతా వస్త్రాల పథకాన్ని పునరుద్ధరించాలి. నేత కార్మికులకు ఉపాధి హామీలో స్థానం లేకపోవడంతో ఉపాధికై ఎదురు చూస్తున్నారు. చేనేత రంగంపైజీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పించే చేనేత పరిశ్రమకు అన్ని రకాల పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలి. చేనేత సహకారసంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి.

మారుమూల గ్రామంలో చేనేత దినోత్సవం

వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి



జాతీయ చేనేత దినోత్సవాన్ని రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో మారుమూల గ్రామమైన ఆదివారపుపేటలో నిర్వహించేందుకు చేనేత నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 70 మంది కార్మికులకు రూ.50వేలు చొప్పున ముద్ర రుణాలు, 25 మందికి చేనేత మగ్గాలు అందిస్తాము. జిల్లాలోని చేనేత సహకార సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాం. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాము.

ఉమ్మడి జిల్లాలో మూడుచోట్ల చేనేత దినోత్సవ సభలు

కె.పెద్దిరాజు, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు



జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. కోనసీమ జిల్లాకు సంబంధించి రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ఆదివారపుపేటలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పాల్గొంటారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురంలో జరిగే సభలో కలెక్టర్ షాన్‌మోహన్, తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం మురమండలో జరిగే చేనేత దినోత్సవంలో కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

ఎరుపెక్కిన రాజమహేంద్రి

- సుబ్రహ్మణ్య మైదానంలో సీపీఐ జిల్లా 26వ మహాసభలు ప్రారంభం
- కేంద్రం, రాష్ట్రంలో అసమర్థపాలన
- రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ



రాజమహేంద్రవరంలో సీపీఐ శ్రేణుల ప్రదర్శన

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎర్ర జెండాలతో కామ్రేడ్‌లు కదంతొక్కారు. సీపీఐ జిల్లా 26వ మహాసభలు రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో ఏర్పాటు చేసిన చిట్టూరి ప్రభాకర చౌదరి వేదికలో జరిగిన ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ముఖ్యవక్తలుగా విచ్చేశారు. తొలుత సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో ప్రజా నాట్యమండలి కళాకారులతో నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలతో భారీ స్థాయిలో కార్యకర్తలు స్థానిక చర్చిగేటు నుంచి ప్రదర్శనగా బయలుదేరి దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా సుబ్రహ్మణ్య మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రామకృష్ణ, అక్కినేని వనజ మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అసమర్థ పాలన సాగిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు ఏడాది కాలంలో నష్టపోయారని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తొలిరోజు జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కొండ్రపు రాంబాబు, రేఖా భాస్కరరావు, కాకినాడ, కోనసీమ జిల్లాల కార్యదర్శులు కామిరెడ్డి గోడకొండ, దేవా రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, వి.కొండలరావు,చప్పా రమణ,పి.లావణ్య, చింతలపూడి సునీల్, రెడ్డి రమణ, జీపీ రామారావు, నల్లా రామారావు, జ్యోతిరాజు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పుష్కర రైల్వే పనులు మొదలయ్యాయి

- ద.మ. రైల్వే జీఎం శ్రీవాస్తవ
- రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్ల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న రైల్వే జీఎం శ్రీవాస్తవ

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027కి సంబంధించి రైల్వే పనులు మొదలయ్యాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ప్రస్తుతం భౌతిక పనులకు ముందు జరిగే కసరత్తు నడుస్తోందని, భవన తదితర నిర్మాణాలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కచ్చితమైన ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అనుకున్న సమయానికి పనులు పూర్తయ్యేలా విధులు నిర్వర్తించడంతోపాటు ప్రయాణికులకు అన్ని సదుపాయాలు, సౌకర్యాలతో ఏర్పాట్లు ఉండే విధంగా పక్కా ప్లానింగ్‌తో ముందుకు వెళుతున్నామన్నారు. బుధవారం ఆయన రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్లను పరిశీలించారు. రాజమండ్రి రైల్వేస్టేషన్లలో పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. వివిధ విభాగాల వద్ద ప్రస్తుతం ఉన్న ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఇంకా అవసరాలపై ఆరా తీశారు. మ్యాప్ ద్వారా పరిశీలించి సూచనలు చేశారు. స్టేషను రీ-మోడలింగ్‌లో భాగంగా తూర్పు వైపు ఐదు ఫ్లోర్లతో భవనం రానుంది. అయితే పుష్కరాల నాటికి కనీసం రెండు ఫ్లోర్లు పూర్త య్యే విధంగా పనులు చేయాలని చెప్పారు. గదుల నిర్మాణం పూర్తి కాకపోయినా ఫ్లోర్లను పుష్కరాల విధులకు వచ్చే సిబ్బంది కోసం వినియోగించాలని సూచించారు. ఆరో ప్లాట్‌ఫాం పూర్తికావాలని ఆదేశించారు. అలాగే ప్రయాణికులు వేచివుండే ప్రదేశాల వద్దే టికెట్ కౌంటర్లు, తాగునీరు, ఫ్లాన్లు వంటివి ఏర్పాటు చేయాలని.. కలర్ కోడింగ్ కోడింగ్‌లను ఉపయోగించడం ద్వారా ప్రయాణికులు అయోమయానికి గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాల నాటికి పనులు ఏ మేరకు పూర్తయినా ప్రయాణి కులకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. గోదావరి రైల్వే స్టేషనులో ప్లాట్‌ఫాం నిడివిని బ్రిడ్జి వైపు పొడి గించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా పరమైన ఏర్పాట్లపై ఆర్పీఎఫ్ డీఐజీ ఎస్‌జడ్ ఖాన్‌కి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్ఎం మోహిత్ సోనాకియా, ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ షణ్ముగం వడివేలు, ఎస్ఆర్పీ రాహుల్ దేవ్ సింగ్, ఆర్పీఎఫ్ ఏఎస్సీ కోటా జోజి, ఇన్స్‌పెక్టర్ రాజు, ఏడీఈఎన్ ముత్యాలరావు, ఎస్ఎం ఆర్.రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, జోస్, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి ట్రాక్‌లను పరిశీలిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్‌కు వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలి

కేంద్ర మంత్రి జితేందర్ సింగ్‌కు సానా సతీష్ నేతృత్వంలో ఎంపీల వినతి



కేంద్ర మంత్రి జితేందర్ సింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీలు

కాకినాడ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీకి వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలని కోరుతూ కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్‌ను బుధవారం న్యూఢిల్లీలోని టెక్నాలజీ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర ఎంపీలు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు సమర్పించిన అనేక కీలక ప్రతిపాదనలపై ఎంపీలు చర్చించారు. వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలని, శాస్త్రీయ పరిశోధన మౌలిక సదుపాయాలు అందించాలని, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు డాప్లర్ వాతావరణ రాడార్ కవరేజ్ కల్పించాలని రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు కోరారు. వ్యూహాత్మక శాస్త్ర సాంకేతి క రంగంలో జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీల బృందం విన్నవించినట్లు సతీష్ క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

11న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా-2025

కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న ఉదయం 9గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్టు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.వేణుగోపాలవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రెంటిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి సెలెక్ట్ చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టీసీ సర్టిఫికేట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇస్తూ బుధవారం కాకినాడ కలెక్టర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నోడల్ అధికారి షాన్‌మోహన్ ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూ విభాగంలో ఉన్న వీరికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. వీరు కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామారాజు జిల్లాల్లో నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

జంతు హింస నివారణకు కేంద్రం ప్రత్యేక చర్యలు

కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జంతు హింస నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ చెప్పారు. బుధవారం ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. జంతు హింస నివారణ చట్టం, 1960 ప్రకారం మొదటి తప్పిదానికి కనీసం రూ.10 నుంచి గరిష్ఠంగా రూ.50 వరకు జరిమానా విధిస్తున్నామని చెప్పారు. మూడేళ్లలో మరలా తప్పు చేస్తే రూ.25 నుంచి రూ.100 వరకు జరిమానా గానీ, మూడునెలల వరకు జైలు శిక్ష విధిస్తున్నట్టు ఆయన వెల్లడించారన్నారు. గత ఐదేళ్లలో అఖిల భారత జంతు సంక్షేమ బోర్డు దేశ వ్యాప్తంగా 4,589 ఫిర్యాదులు స్వీకరించి ఆయా రాష్ట్రాలకు పంపగా 306 కేసులపై చర్యలు తీసుకున్నట్టు చెప్పారన్నారు. ఏటా జనవరి 14 నుంచి ఫిబ్రవరి 13వరకు జంతు సంక్షేమ మాసం నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారన్నారు.

కాకినాడ మత్స్యకారులను విడిపించాలి

శ్రీలంకలోని భారత కాన్సుల్ అధికారికి కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ లేఖ

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా దురదృష్టవశాత్తూ శ్రీలంక దేశ సముద్ర జలాల్లోకి ప్రవేశించి బందీలుగా చిక్కిన కాకినాడ మత్స్యకారులు నలుగురిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం శ్రీలంకలోని భారత్ కాన్సుల్ జనరల్ అధికారి సాయిమురళీకి లేఖ రాశారు. కాకినాడ జగన్నాథపురానికి చెందిన పంతాడి బ్రహ్మానందంతోపాటు మరో ముగ్గురు మత్స్యకారులు ఈనెల 2న తమిళనాడులో రెండు బోట్లు కొనుగోలు చేసి సముద్ర మార్గం ద్వారా కాకినాడ తీరం వైపు వస్తుండగా రెండు రోజుల తర్వాత నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య వల్ల దారి తప్పి శ్రీలంక జలాల్లోకి ప్రవేశించడంతో వారిని కంకేసంతురై వద్ద శ్రీలంక నేవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రస్తుతం జాఫ్నాలో రిమాండ్‌లో ఉన్న నలుగురు మత్స్యకారులను విడుదల చేసి సురక్షితంగా స్వదేశానికి పంపాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

చదవడం, రాయడం కూడా నేర్పకపోతే ఎలా?

ఆర్జేడీ నాగమణి

సామర్లకోట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తున్నందున విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం కూడా నేర్పకపోతే ఎలా అని విద్య ఆర్జేడీ నాగమణి ఉపాధ్యాయులను ప్రశ్నించారు. కాకినాడ జిల్లా సామర్ల కోట మండలం మాధవపట్నం జమునానగర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల అకడమిక్ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చదవడం, రాయించడంతో బాటు కూడిక, తీసివేత, గుణకారం, భాగాహారాలు, తరగతికి చెంది ఎక్కాలను కూడా అడిగి విద్యార్థుల మేధస్సు తీరు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవలే ఉపాధ్యాయుల సమీక్షలో సాక్షాత్తూ డీఈవో పలువురు ఉపాధ్యాయుల తీరును హెచ్చరించిన విషయం విదితమే. ఉపాధ్యాయులుగా మనం అంచెలంచెలుగా మారుతున్నప్పుడు విద్య బోధన తీరులో పోకడలు మార్చాలి కదా అని గుర్తు చేశారు. ప్రాథమిక విద్యాస్థాయిలోనే చదవడం, రాయడం అందరు విద్యార్థులు అలవర్చుకునేలా తీర్చిదిద్దాలని ఆర్జేడీ నాగమణి హితవు పలికారు. ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ విజయం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కాకినాడ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ విజయం సాధించిందని, 2029లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలో వున్న 11 ఏళ్ల కాలంలో బ్యాంకు లకు రూ.100 కోట్లు పైబడి బకాయిపడిన పారిశ్రామికవేత్తలకు రూ.14.50 లక్షల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. ఇందులో బీజేపీ పెద్దలకు లబ్ధి చేకూరుతూ లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్, అరకు ప్రాంతాల మధ్య ఖనిజాలను పారిశ్రామికవేత్తలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను చిత్రహింసలకు గురిచేస్తోందన్నారు. రకరకాలుగా హింసించి చంపడంతో పాటు కొందరి మర్మాంగాల్ని కోసేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో మద్యం పాలసీ విధానంలో కోట్లాది అవినీతి జరిగిందని, అందులో ఉన్న ప్రతిఒక్కరూ జైలుకు పోతారన్నారు. మద్యం కుంభకోణంలో జయలలిత, కేజ్రీవాల్, కవిత జైలుకెళ్లారని, జగన్ కూడా వెళ్లడం ఖాయమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో చోరీ.. తునిలో వదిలి పరారీ..



- సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు లారీ అపహరణ
- రూ.28 లక్షల విలువైన సరుకు మాయం
- రెండు రోజుల క్రితం ఇదే తరహాలో సంఘటన

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడుతో ఉంచి లారీ చోరీకి గురి కావడం సంచలనం కలిగించింది. అందులో ఉంచిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అపహరించి లారీని తుని సమీపంలో వదిలివేసి పరారయ్యారు చోరీకి పాల్పడిన ఆగంతకులు.

కాకినాడలోని డైరీఫారమ్ సెంటర్‌కు చెందిన ఓనర్ కమ్ డ్రైవర్ దగ్గు అప్పారావు నగర శివారులోని జెమిని కంపెనీ వద్ద సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను తన లారీలో మంగళవారం సాయంత్రం లోడు చేసుకున్నాడు. లోడు లారీతో రాత్రి 8.30గంటల సమయంలో పిఠాపురం తీసుకు వచ్చి వెలంపేటకు చెందిన డ్రైవర్ నాళం రమణకు అప్పగించాడు. లోడు ఒరిస్సాలోని భువనేశ్వర్ తీసుకువెళ్లాలని చెప్పి పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయం సమీపంలో లారీని పార్కు చేశాడు. బుధవారం ఉదయం 5.30గంటల సమయంలో నాళం రమణ వచ్చి చూసుకునే సరికి లారీ మాయమైంది. గుర్తుతెలియని ఆగంతకులు లారీతో ఉడాయించినట్టు గుర్తించాడు. వెంటనే యజమానికి దగ్గు అప్పారావుకు సమాచారం అందించాడు. అందులో రూ.28లక్షలు విలువైన సన్‌ఫ్లవర్ ఆయిల్‌ప్యాకెట్లు ఉండడంతో అప్పారావు పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీసీ కెమెరాలు, గొల్లప్రోలు టోల్‌గేటు వద్ద రికార్డులు, అక్కడ ఉన్న కెమెరాలు పరిశీలించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1.27గంటలకు టోల్‌గేట్ దాటినట్టు గుర్తించారు. ఫాస్టాగ్ ద్వారా కాకుండా టోల్‌ఫీజును నగదు రూపంలో చెల్లించారు. దీంతో సమీపంలోని అన్ని పోలీసుస్టేషన్లకు సమాచారం అందించారు. ఉదయం 11 గంటల సమయంలో లారీని తుని సమీపంలో 16వ జాతీయ రహదారిపై గల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వదిలివేసినట్టు సమాచారం వచ్చింది. దీంతో అక్కడకు వెళ్లి చూడగా అందులో సరుకు పూర్తిగా మాయమైంది. ఖాళీ లారీ మాత్రమే అక్కడ ఉంది. అందులోని సరుకును గొల్లప్రోలు-తుని మధ్య ఎక్కడో చోరీకి పాల్పడిన ఆగంతకులు డంప్ చేసి లారీని వదిలివేసి పరారైనట్టు భావిస్తున్నారు. ఈ సంఘటన పిఠాపురం పరిసర ప్రాంతాల్లో తీవ్ర సంచలనం కలిగించడంతో పాటు చర్చనీయాంశంగా మారింది. సన్‌ఫ్లవర్ లోడు లారీని ఆగంతకులు ఎలా గుర్తించారు, ఇది తెలిసున్న వారి పనా, లేకుంటే లారీని ఫ్యాక్టరీ నుంచి ఫాలో అవుతూ వచ్చిన వారు ఈ సంఘటనకు పాల్పడ్డారా అని అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అదేవిధంగా లారీని ఆగంతకులు తీసుకువెళ్తున్న సమయంలో ఒకవ్యక్తి మోటార్‌సైకిల్‌పై టోల్‌గేట్ దాటే వరకూ వెన్నంటి ఉండటం పోలీసుల విచారణలో వెల్లడైంది.

తుని ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో వదిలివేసిన ఖాళీ లారీ

పోలీసుల తీరుపై విమర్శలు

చోరీలు అధికమవుతున్నా పోలీసులు సరైన నిఘా ఉంచకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2రోజుల క్రితమే లారీ చోరీకి గురై దొరికిన సంఘటన జరిగినా దానిపై పోలీసులు విచారణ జరపకపోవడం, రాత్రి పూట గస్తీ పెంచకపోవడంతో ఇటువంటి ఘటన వెనువెంటనే జరగడానికి కారణమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల పిఠాపుంతో పాటు నియోజకవర్గంలో చోరీలు ఎక్కువైనా రాత్రిళ్లు నిఘా ఎందుకు ఉంచడంలేదనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

మరో లారీ చోరీ...

పిఠాపురంలో ఇదే తరహాలో ఆదివారం రాత్రి ఒక లారీ చోరీకి గురైంది. డ్రైవర్స్‌కాలనీలోని టీడీపీ నాయకుడికి చెందిన నూకలలోడుతో ఉన్న లారీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. అయితే లారీకి జీపీఎస్ ఉన్న విషయాన్ని గుర్తించిన ఆగంతకులు తాము దొరికిపోతామనే భయంతో రౌతులపూడి మండలం గిడజాం వద్ద వదిలి పరారయ్యారు. దీంతో సరుకుతో సహా సదరు నాయకుడు లారీని తెచ్చుకున్నారు.



నీలి మేఘం.. గోదారితో స్నేహం...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి గోదావరిలో బుధవారం ఈ అందమైన దృశ్యం విశేషంగా ఆకట్టుకుంది. ఒకపక్క ఎండ సుర్రుమనిపిస్తుంటే ఆ వెంటనే చల్లగా నీలిమేఘం దిగివచ్చి గోదావరిని తాకుతున్నట్టు కనిపించిన దృశ్యం గోదావరి బ్రిడ్జిపై ప్రయాణించే వారిని అబ్బురపరిచింది - ఆలమూరు (ఆంధ్రజ్యోతి)

కువైట్‌లో పొన్నమండ యువకుడి మృతి

అధికారుల చొరవతో స్వగ్రామానికి మృతదేహం



దుర్గాసంతోష్ (ఫైల్)

రాజోలు/అమలాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండకు చెందిన కడలి సూర్యనారాయణకుమారుడు దుర్గాసంతోష్ (35) ఇటీవల కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతిచెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు బుధవారం తెలిపారు. దుర్గాసంతోష్‌కు మలికిపురం మండలం లక్కవరానికి చెందిన సాయికుసుమతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. జీవనోపాధి నిమిత్తం దుర్గా సంతోష్ 3 నెలల క్రితం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ నివాసం ఉంటున్న గదిలోని ఏసీకి ప్రమాదవశాత్తూ మంటలు అంటుకోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. కువైట్ నుంచి సంతోష్ మృతదేహం బుధవారం పొన్నమండకు చేరుకుంది. దుర్గాసంతోష్ అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. దుర్గాసంతోష్ మృతదేహాన్ని చూసి భార్య, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టిస్తుంది. ఈ విషయంపై కోనసీమ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పొన్నమండకు చెందిన దుర్గాసంతోష్ మరణించడం దురదృష్టకరమని తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ కీలకంగా పనిచేసి మృతదేహాన్ని గుర్తించడంలో సహాయపడ్డారని తెలిపారు. దాంతో కువైట్ నుంచి కార్గో విమానంలో హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఏపీ ఎన్‌ఆర్టీవారి సహాయ సహకారాలతో అంబులెన్సు ఏర్పాటుచేసి ఆ మృతదేహాన్ని పొన్నమండలోని దుర్గాసంతోష్ స్వగృహానికి చేర్చడంలో అధికారులంతా కృషి ప్రశంసనీయమన్నారు. వికాస పీడీ కె.లచ్చారావు, మేనేజర్ జి.రమేష్, సిబ్బంది, మహిళా పోలీసులు షేక్ బీబీసఫియా, హెచ్‌కానిస్టేబుల్ సత్తిబాబును కలెక్టర్ అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు
తమ్మయ్యపేట వద్ద ఘటన



మరణించిన అబ్బు

తొండంగి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోదాడ గ్రామానికి చెందిన దడాల అబ్బు (56) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ గ్రామానికి చెందిన అబ్బుకు నడుము నొప్పి కారణంగా కుమారుడు రాజకుమార్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై కాకినాడ ఆసుపత్రికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మోటార్ సైకిల్‌ను రాజకుమార్ నడుపుతుండగా అబ్బు వెనుక కూర్చున్నాడు. తమ్మయ్యపేట కాగితాలమ్మ గుడి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు కిందపడ్డారు. రాజకుమార్‌కు గాయాలు కాగా అబ్బు తలకు బలమైన గాయమై చెవుల నుంచి రక్తం కారింది. బంధువులకు సమాచారం అందించడంతో వారు తుని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అబ్బును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధృవీకరించారు. రాజకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



భీమనపల్లి ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారుల బృందం

రూ.24,52,346 విలువైన ఎరువులు సీజ్

ఉప్పలగుప్తం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి శ్రీలక్ష్మీనారాయణ ఏజన్సీలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో 100 టన్నుల ఎరువులు స్టాకు రిజిష్టర్‌లో నమోదు కానట్టు గుర్తించారు. రూ.24,52,346 విలువైన ఎరువులు సీజ్ చేసినట్టు ఏవో గుత్తుల కుమార్‌బాబు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

15,190 కిలోల బియ్యంతో లారీ స్వాధీనం



పట్టుబడిన లారీతో ఎంఎస్‌వో బాపిరాజు

రాజానగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు సమీపంలో రాజానగరం మండల సివిల్ సప్లై అధికారి గొలుగూరి బాపిరాజు పట్టుకున్నారు. రాజానగరం మండలం ఆటోనగర్ సమీపంలో గ్రామన్ బ్రిడ్జ్ రోడ్డుపై కొవ్వూరు వైపు నుంచి దివాన్‌చెరువు వైపు వెళ్తున్న లారీలో పీడీఎస్(రేషన్)బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీ ముందు తెలుపు రంగు కారులో ఇద్దరు ఎస్కార్ట్‌గా వెళ్తున్నారని చెప్పారు. ఏవిధమైన కాగితాలు తనకు ఇవ్వలేదని, లోడు కూడా మొక్కజొన్న లోడు అని తనకు చెప్పారని, అంతకు మించి తనకు ఏమీ తెలియదని లారీ డ్రైవర్ తంగిరాల ఏడు కొండలు బదులిచ్చాడన్నారు. రేషన్ బియ్యం బస్తాలను పరిశీలించగా 83 ప్లాస్టిక్ సంచుల్లో 3,140 కిలోలు, 241 సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సంచుల్లో 12050 కిలోలు, మొత్తం 324 సంచుల్లో 15,190 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. బియ్యం విలువ రూ.6,98,740గా అంచనా వేశామన్నారు. డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం యజమాని ఫోన్ నెంబరు తప్ప మరే ఇతర సమాచారం లేదని, ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వస్తుందని, ట్రూకాలర్ ప్రకారం మహమ్మద్ అలియా అని వస్తున్నట్టు ఎంఎస్‌వో చెప్పారు. బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

వాడపల్లిలో ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు



ఆలయంలో స్వామివారికి పవిత్రాలతో అలంకరణ

ఆత్రేయపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 3 రోజుల పాటు తిరుమల తరహాలో నిర్వహించిన పవిత్రోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. వసంతమండపంలో ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యహవచనం, మహాశాంతి హోమం, ప్రాయిశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, పవిత్రవిసర్జన, మహాదాశీర్వచనం, తదితర కార్యక్రమాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు స్వామివారి పవిత్రోత్సవాలను నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు పవిత్రాలను అలంకరించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉపకమిషనర్ ఈవో నల్లం సూర్యచక్రధరరావు, డీఎస్పీ సుంకర మురళీమోహన్, కూటమినాయకులు, దాతలు స్వామివారిని దర్శించుకున్నారు.



పవిత్రోత్సవ పూజల దృశ్యం

అభివృద్ధి పనుల పరిశీలన

వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీరామరాజు, భారతి విద్యాభవన్ ఛైర్మన్ ఉద్దరాజు విశ్వనాధరాజు, రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ సెక్రటరీ కొత్త శ్రీనివాస్, గాంధీ, సురేష్ ప్రముఖులతో కలిసి పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవనంలో రూ.1.50కోట్లతో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రామరాజును కోరగా సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కాటేజీ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం అందించేందుకు కొత్త శ్రీనివాస్ ముందుకు వచ్చారని తెలిపారు.

హోరాహోరీగా..

కాకినాడలో ఆరో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న మణిపూర్, అస్సాం జట్లు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్ షిప్2025లో భాగంగా కాకినాడలో బుధవారం ఆరో రోజు మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అస్సాం, మణిపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మణిపూర్ 3-1తో విజయం సాధించింది. కేరళ, ఉత్తరాఖండ్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 7-0 స్కోర్‌తో విజయం సాధించింది. హిమాచల్‌ప్రదేశ్, బీహార్ జట్ల మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్ మ్యాచ్‌లో తమిళనాడు 5-0, మధ్యప్రదేశ్, పంజాబ్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 4-0తో విజయం సాధించాయి. హర్యానా, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మ్యాచ్‌లో జార్ఖండ్ 7-1తో విజయం సాధించింది. ఒరిస్సా, మహారాష్ట్ర మ్యాచ్‌లో మహారాష్ట్ర 2-1తో విజయం సాధించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జీఎం బి.కిరణ్‌కుమార్, కాకినాడ జిల్లా ముఖ్య ప్రణాళికారి పి.త్రి నాథ్, చేయూత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఎం.రవికుమార్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను వీక్షించారు. హాకీ సంఘ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.థామస్‌పీటర్, భవానీశంకర్ పర్యవేక్షించారు.



జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మ్యాచ్ దృశ్యాలు



అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు

మలికిపురం మహిళలకు ఎస్‌ఐలుగా ఒకేచోట పోస్టింగ్



ఎస్‌ఐలు కరుణ, రేవతి

మలికిపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన కడలి కరుణ, కడలి రేవతి అక్కాచెల్లెళ్లు. వారిద్దరు ఎస్‌ఐ కోచింగ్ తీసుకుని ఒకేసారి ఎంపికయ్యారు. వారికి మోకా సత్తిబాబు కోచింగ్ సెంటర్ నందు ఉచిత కోచింగ్ అవకాశం కల్పించారు. అక్కాచెల్లెళ్లు ఎస్‌ఐలుగా ఎంపికవ్వగా విజయవాడసిటీ పోలీసుస్టేషన్‌లో పోస్టింగ్ లభించింది. వారి తండ్రి వెంకటేశ్వర్లు చికెన్ సెంటర్ నందు పనిచేస్తుండగా తల్లి గృహిణి. వారికి ఎస్‌ఐలుగా పోస్టింగ్ రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లిలో జాతీయరహదారి పక్కన ఉన్న ఒక ఇంట్లో జనవరి 2న చోరీ జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా చోరీకి పాల్పడ్డ కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్‌ను బుధవారం గండేపల్లి ఎస్‌ఐ యువి శివనాగబాబు తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. రూ.9వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో ప్రవేశపెట్టగా 14రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నకిలీ ఈపీఎఫ్ చలానాలపై

అన్నవరంలో ఆర్జేసీ విచారణ



ఈవో కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఆర్జేసీ త్రినాథరావు

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటరీ కార్మికుల పీఎఫ్ చెల్లింపులకు సంబంధించి నకిలీ చలానాల వ్యవహారంపై దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలతో బుధవారం ఆర్జేసీ త్రినాధరావు విచారణ చేపట్టారు. ఈవో కార్యాలయంలో శానిటరీ విభాగ అధికారులు, శానిటరీ కాంట్రాక్టర్‌ను పిలిచి దీనికి సంబంధించి విచారణ చేపట్టారు. నకిలీ చలానాలు ఏ విధంగా సమర్పించారు అని కాంట్రాక్టర్ తరుపున వ్యక్తిని ప్రశ్నించగా అవి తాము సమర్పించినవి కాదని, తాము సమర్పించినట్లయితే తమ సంస్థ స్టాంప్, సంతకం ఉంటాయని వివరణ ఇచ్చారు. వివాదం తరువాత ఒకే నెలలో 3 రసీదులు ఒరిజనల్ ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. ఇరువర్గాల నుంచి సమాచారం సేకరించిన ఆర్జేసీ త్రినాధరావు నివేదికను కమిషనర్‌కు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, శానిటరీ ఏఈవో శ్రీనివాస్, సూపరెంటెండెంట్ గుర్రాజు తదితరులు ఉన్నారు.

దంపతులను నాటు తుపాకీతో కాల్చిన వ్యక్తి అరెస్ట్

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం శృంగధారలో కాకూరి చంద్రరావు, అతడి భార్య సూర్యావతిలను నాటు తుపాకీతో కాల్చిన సంఘటనలో నిందితుడిని బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వివరాలు వెల్లడించారు. శృంగధారకు చెందిన సూర్యావతి రాజవొమ్మంగి మండలానికి చెందిన ముర్ల మణికుమార్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉండి సహజీవనం చేసింది. భర్త, పిల్లలు గుర్తుకురావడంతో వారంక్రితం శృంగధారలో భర్త ఇంటికి చేరుకుంది. దీంతో కక్ష పెంచుకున్న మణికుమార్‌తో నాటు తుపాకీతో చంద్రరావు, సూర్యావతిని ఈనెల 3న రాత్రి కాల్చి గాయపరిచి పరారయ్యాడు. అతడిని పెద్దమల్లాపురం శివార్లలో అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

బైక్‌పై యువకుల ప్రమాదకర ఫీట్లు

అదుపులోకి తీసుకున్న పోలీసులు

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై అతి వేగంగా వెళ్తూ ప్రమాదకర ఫీట్లు వేసి విద్యార్థులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన యువకులను కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. బీఎన్‌ఎస్ యాక్టు 125 కింద కేసు నమోదు చేశారు. పిఠాపురం పాతబస్టాండు వద్ద నుంచి ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా ఉప్పాడ బస్టాండు వరకు ఇద్దరు యువకులు మంగళవారం పలుమార్లు బైక్‌పై విన్యాసాలు చేస్తూ ఆందోళనకు గురిచేశారు. దీంతో పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు.

మహాలక్ష్మిగా రత్నగిరి వనదుర్గమ్మ



మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న వనదుర్గమ్మ

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ అమ్మవారు శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులను అనుగ్రహించారు. అష్టఐశ్వర్యాలు ప్రసాదించే దేవతగా దర్శనమిచ్చారు. ప్రముఖ వ్యాపారస్తుడు వీర్ల సూరిబాబు కుటుంబసభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. విశేష పూజలు నిర్వహించారు.

22న రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఉచిత శ్రావణ శుక్రవార సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఈ నెల 22న నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు.

పంటకాలువలో జారి పడి బాలిక మృతి



పంటకాలువలో బాలిక మృతదేహం కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

కొత్తపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ శివారు పులుసుగంటివారిపేటకు చెందిన యార్లగడ్డ లోకేశ్వరి(15) ప్రమాదవశాత్తు అమలాపురం- పలివెల ప్రధాన పంట కాలువలో జారి గల్లంతైంది. ఆచూకీ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలించగా మృతదేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. కండ్రిగకు చెందిన యార్లగడ్డ వెంకటరమణకు పిల్లలు లేకపోవడంతో బంధువుల నుంచి ఓ బాలిక తీసుకుని కుమార్తెలా చూసుకుంటున్నాడు. మంగళవారం ఇంట్లో చెత్తను కాలువలో పడవేసేందుకు లోకేశ్వరి వెళ్లగా కాలు జారి గల్లంతైనట్టు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కొవ్వూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గేదెలను లంకలో మేతకు తోలుకెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన ఇంటి అప్పారావు (49) ఈ నెల 4న గేదెలను మేత కోసం గోదావరి మధ్య లంకలలోకి తోలుకెళ్లాడు. సాయంత్రం గేదెలు తిరిగివచ్చాయి. అప్పారావు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. గ్రామంలోని ఇసుక ర్యాంపు వద్ద తలపాగా, సెల్‌ఫోను, షర్ట్ దొరకడంతో గోదావరిలో గల్లంతై ఉండవచ్చని కుటుంబ సభ్యులు 2రోజులుగా నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో అప్పారావు కుమారుడు ఇంటి అనంత సత్యనారాయణమూర్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు పెద్దాపురంలో చేనేత సదస్సు

పెద్దాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ముప్పన రామారావు సామాజిక భవనంలో సదస్సు నిర్వహించనున్నట్టు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు పెద్దిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) హాజరవుతారని చెప్పారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యాధికారులు

ఎన్‌సీడీ 4.0 సర్వేపై అవగాహన

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) ఎన్‌సీడీ 4.0 హౌస్ హోల్డ్ సర్వే కోసం క్యాన్సర్లపై డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ప్రాంగణంలోని ఆర్ఎంసీ ఎంఆర్‌యూలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధారణ క్యాన్సర్లు (ఓరల్, సర్వికల్, బ్రెస్ట్)పై అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు (టీవోటీ) ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, డాక్టర్ అరుణ, డాక్టర్ రుక్మిణి, పలు విభాగాల అధిపతులు, ఎన్‌సీడీ సిబ్బంది, ఏహెచ్, సీహెచ్‌సీ స్థాయిల్లో ఎంపికైన వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన సహాయాన్ని చెక్కు రూపంలో అందిస్తున్న జనసేన నాయకులు

అనాథ పిల్లలకు డిప్యూటీ సీఎం ఆసరా

42 మందికి రూ.2.10 లక్షలు అందజేసిన జనసేన నాయకులు

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేని పిల్లలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన జీతంతో అండగా నిలిచారు. వరుసగా నాలుగవ నెల పిఠాపురం నియోజకవర్గంలోని 42 మంది అనాథ పిల్లలకు రూ.5వేలు వంతున రూ.2.10 లక్షలను చెక్కుల రూపంలో పవన్ పంపించారు. పది మంది జనసేన క్రియాశీలక నాయకులు, కార్యకర్తలు బుధవారం పిల్లల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు.



అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న పాడా ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ

'ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలి'

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి పరిష్కరించాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ ఆదేశించారు. బుధవారం ఆయన పాడా కార్యాలయం నుంచి నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. పీ 4 సర్వే ద్వారా గుర్తించిన కుటుంబాల వివరాలు, వారి అవసరాలపై గుర్తించిన అంశాలు, ప్రభుత్వం నుంచి వచ్చిన నూతన మార్గదర్శకాలు, మిస్‌మ్యాచ్ అయిన వివరాలపై మరోమారు సర్వే నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భోజనానికి వచ్చిన వారి అభిప్రాయాలు సేకరించారు. పీడీ వెంట మున్సిపల్ కమిషనరు నామ కనకారావు, అధికారులు ఉన్నారు.



విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధిస్తున్న శ్రీనివాస్

'మానవ పురోభివృద్ధికి సైన్స్ ఉపయోగపడాలి'

పెద్దాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మానవ పురోభివృద్ధికి సైన్స్ ఉపయోగపడాలని ఏసీటీ సైన్స్ సెంటర్ నిర్వాహకుడు బుద్దా శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్, ఏసీటీ సైన్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో హిరోషిమా డే అంశంపై బుధవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన హ్యూమనాయిడ్ రోబో, రోబో డాగ్

ఏపీఎల్‌లో 'కాకినాడ కింగ్స్' విజయం కోరుతూ...

కాకినాడ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో శుక్రవారం జరిగే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో కాకినాడ కింగ్స్ జట్టు విజయం సాధించాలని కైట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ జట్టుకు కైట్ విద్యార్థి మణికంఠ గంగాధర్ ఎంపిక కావడంతో బుధవారం కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను అభినందించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, ల్యాబ్‌లో ఉండే హ్యూమనాయిడ్ రోబో, రోబో డాగ్ అభినందనలు తెలపగా రోబోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సీనియారిటీ లిస్టుపై రెండు అభ్యంతరాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో సూపరింటెండెంట్ల సీనియారిటీ లిస్టుపై ఇంజనీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ జి.దుర్గారావు, ఇన్‌చార్జి అక్కౌంటెంట్ ఎంవి రామశాస్త్రి అభ్యంతరాలు తెలిపినట్టు ఇన్‌చార్జి మేనేజరు ఎస్.సీతారాం తెలిపారు. అందిన ఫిర్యాదులను ఫైనల్ చేసి కమిషనరు భావనకు రిపోర్టు అందజేస్తానని తెలిపారు.

ప్రధాన పైప్‌లైనుకు లీకులు

» నిత్యం సుమారు లక్ష లీటర్ల తాగునీరు వృథా » ఆరు రోజులుగా ఇదే పరిస్థితి » పట్టించుకోని అధికార యంత్రాంగం

కొత్తపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో తాగునీరు సరఫరా జరిగే ప్రధాన పైప్‌లైను లీకై సుమారు ఆరు రోజులు దాటింది. వాకతిప్ప మెయిన్‌రోడ్డులో కాపుల రామాలయం సమీపంలో ప్రధాన పైప్‌లైను పైనుంచి భారీ వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. దీంతో రోడ్డు అడుగు భాగంలో నిర్మించిన పైపు విరిగింది. ఆరు రోజులైనా నేటికీ మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రతిరోజూ లక్ష లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. రక్షిత మంచినీరు సరఫరా జరిగే మెయిన్ పైప్‌లైను నుంచే మండలంలోని 18 గ్రామాలకు తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. గ్రామాలకు నీటిని పంపింగ్ చేసే సమయంలో వేలాది లీటర్ల తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బద్దలైన పైప్‌లైను నుంచి ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న మురుగునీరు కూడా కలుస్తుండడంతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



వాకతిప్ప రామకోవెల సమీపంలో రక్షిత మంచినీటి ప్రధాన పైప్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

వీఏఏల సమస్యలను పరిష్కరించాలి

సామర్లకోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న తాము తీవ్ర పని ఒత్తిడితో సతమతమవుతున్నందున సమస్యలను సత్వరం పరిష్కరించాలని, పనిభారం తగ్గించాలని కోరుతూ జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ ప్రతినిధులు ఎంవీవీ రమణ, టి.సోమరాజు, షేక్ షావనాజ్, పి.జగదీష్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఈ-పంట నమోదును 2019లో ఇచ్చిన ట్యాబ్‌లతోనే చేయాల్సి రావడం ఇబ్బంది కలిగిస్తోందన్నారు. ట్యాబ్‌లు సక్రమంగా పని చేయట్లేదన్నారు. పంట నమోదులకు సంబంధించి ఈ సీజన్ నుంచి చేసిన మార్పుల ప్రకారం పంటకు కేవలం 20 మీటర్ల రేడియస్‌లోనే ఇచ్చారన్నారు. దీనివల్ల గర్భిణులు, వికలాంగులు, మహిళలు క్షేత్ర స్థాయిలో 20 మీటర్ల రేడియస్ పరిధిలోకి రావడం సాధ్యపడదన్నారు. ఇటీవల విధి నిర్వహణలో పొలంగట్టుపై పాము కాటుకు గురై ఒక ఎంపీఈవో మృతి చెందాడన్నారు. క్షేత్రస్థాయిలో తమ సమస్యలను సత్వరం పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని వీఏఏలు కోరారు. దీనిపై విజయకుమార్ మాట్లాడుతూ ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్‌కి వినతిపత్రం ఇస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు



కుళాయిలోంచి వచ్చిన బురద నీరు

పసరు రంగులో తాగునీరు

సామర్లకోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కుళాయిల ద్వారా నిత్యం తాగునీరు పసరు రంగులోను, బురదమయంగా సరఫరా అవుతోంది. దీంతో ఆ నీటిని తాగేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజులుగా పట్టణంలోని మెజార్టీ వార్డుల్లో ఇదే దుస్థితి నెలకొందిజ అయితే మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కుళాయిల ద్వారా బురద నీటిని నియంత్రించలేకపోయారన్న ఆరోపణలున్నాయి. ప్రతిఏటా మున్సిపల్ అధికారులు కౌన్సిల్ సాక్షిగా లక్షలాది రూపాయలను ఫిల్టర్ వాటర్ ప్రాజెక్ట్‌కు వ్యయం చేస్తున్నా స్వచ్ఛమైన తాగునీటికి ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సైతం పలు దఫాలు మున్సిపల్ అధికారులను హెచ్చరించినా ఎటువంటి ఫలితం లేకపోయిందన్న ఆరోపణలు సర్వత్రా వున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు సత్వరం స్పందించి పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'ఆర్టీసీ స్థలాలను లులూ మాల్‌కి అప్పనంగా ఇవ్వడం దారుణం'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోట్లు విలువ చేసే ఆర్టీసీ స్థలాలను లులూ షాపింగ్ మాల్‌కి కేటాయించడం దారుణమని ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పులి జార్జిబాబు అన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లులూ గ్రూపునకు స్థలాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.137 రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవడానికి అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. విద్యుత్ బస్సులను కూడా ఆర్టీసీకి అప్పగించాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకుడు పి.సత్యానందం మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన ఆర్టీసీని నిర్వీర్యం చేయాలని చూడడం చాలా బాధాకరమన్నారు.



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే అధికారులు, సిబ్బంది

సామర్లకోట రైల్వే స్టేషన్లో స్వచ్ఛత, పరిశుభ్రత

సామర్లకోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్లో బుధవారం సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధిపతులు, సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. రైల్వే స్టేషన్‌లోని పలు ప్రదేశాలను, ప్లాట్‌ఫామ్‌లను పరిశుభ్రం చేశారు. ప్రయాణికులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, బీవీ రామసుబ్బారావు, కల్యాణి, మహేష్, రమణ, సంజీవ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రాజభాష పురోగతికి అందరూ కృషి చేయాలని, అందరూ హిందీ భాష నేర్చుకోవాలని విజయవాడ రైల్వే డివిజన్ విశిష్ట రాజ భాషాధికారి హేమంత్ వాడేకర్ పిలుపునిచ్చారు. రైల్వే జీఎం ఆదేశాల మేరకు బుధవారం సామర్లకోట రైల్వేస్టేషన్ ఆవరణలో రాజభాష హిందీపై ఉప సమితి త్రైమాసిక సమావేశాన్ని ఎస్ఎస్ రమేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. దైనందిన కార్యకలాపాల్లో హిందీ ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. విజయవాడకు చెందిన ఉన్నతాధికారులు, స్థానిక రైల్వే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, వెండర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ ధర్నా



దివిలిలో సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా వేదిక నాయకులు

పెద్దాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ మండలంలోని దివిలి సబ్ స్టేషన్ వద్ద ప్రజా వేదిక ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రజా వేదిక ప్రతినిధి కేదారి నాగు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాగాపు నాగు, రామిశెట్టి సుబ్రహ్మణ్యం, మంతెన సత్తిబాబు, దేవాడ పాపేశ్వరరావు, కృష్ణమూర్తి, దారపురెడ్డి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

'ఆటో డ్రైవర్ల జీవనోపాధికి భద్రత కల్పించాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని స్వాగతిస్తున్నామని, ఆటో డ్రైవర్ల జీవనోపాధికి భద్రత కల్పించాలని కాకినాడ స్మార్ట్‌సిటీ ప్యాసింజర్ ఆటో ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం సుందరయ్య భవన్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు సురుకుర్తి సూర్యప్రకాష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సీఐటీయూ నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ మహిళల ఉచిత ప్రయాణంలో ఆటో డ్రైవర్లను భాగస్వాములు చేయాలన్నారు. ఆటోలకు అవసరమైన ఇంధనం అందించి, నెలకు రూ.26వేలు ఇస్తే రోజుకు 8 గంటల పాటు మహిళలను గమ్యస్థానాలకు చేర్చడానికి ప్రభుత్వ పథకానికి లోబడి పనిచేస్తామన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు నక్కా కృష్ణ, కోయ రాజు, పెంకే చంద్రరావు, చెక్కల దుర్గాప్రసాద్, చాట్ల శ్రీనివాస్, పిట్టా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



శ్యామ్‌ను అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

అత్యుత్తమ ఫలితాల సాధకుడు 'శ్యామ్'

కాకినాడ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత గుంటూరి శ్యామ్‌ను ఎస్పీ బిందుమాధవ్ బుధవారం అభినందించారు. సివిల్, ఏపీఎస్పీ విభాగాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉచిత స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని 15 మంది హోంగార్డులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ఫిజికల్ కోచ్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డులకు చేయూత

కాకినాడ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలం కాలం పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు, మరణించిన హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ బిందుమాధవ్ చేయూత ఇచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కె.బాబూరావుకు, మరణించిన హోంగార్డు లోవరాజు కుటుంబానికి హోంగార్డు సిబ్బంది సమకూర్చిన ఒకరోజు వేతనం రూ.4,49,430 ఒక చెక్కు, రూ.1,99,510 మరో చెక్కును ఎస్పీ అందజేశారు. హోంగార్డ్స్ ఆర్ఐ ఎం.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పట్టణంలో కొలువైయున్న పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. పండితులు వేద మంత్రోచ్చారణలతో అంకురార్పణ గావించారు. ఈ నెల 9వ తేదీ వరకు జరుగుతాయి. టీటీడీ సూపరింటెండెంట్ మల్లికార్జున్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాలు పంపిణీ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం ఏపీఐఐసీ కాలనీలోని అడబాల ట్రస్టు కార్యాలయంలో వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. డాక్టర్ సత్యనారాయణ-జానకిరమ దంపతులను అడ్డట్రస్టు అధ్యక్షుడు రత్నప్రసాదరావు, జి.కృష్ణమోహన్, శిరీష సత్కరించారు.

అగ్నిప్రమాద బాధితులకు జనసేన చేయూత

ప్రత్తిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చినశంకర్లపూడిలో అగ్నిప్రమాద బాధితులకు జనసేన నాయకులు గ్యాస్ బండ్ల, నిత్యావసర సరుకులు అందజేశారు. మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి), గోపిశెట్టి శ్రీనులు 6కుటుంబాల బాధితులకు గ్యాస్ బండలు,పొయ్యిలు, నిత్యావసర సరుకులు అందజేశారు. జనసేన నాయకులు పిల్లా పద్మరాజు, పిల్లా బాబు రావు, కొప్పన విజయ్‌నాయుడు, కరణం సుబ్రవాహ్మణ్యం,రామకుర్తి కామేష్, సీరం శ్రీను, అచ్చిరెడ్డి సతీష్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

టీడీపీ అభివృద్ధే అందరి లక్ష్యం

● పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఎమ్మెల్యే శిరీషదేవి



కామారెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వై.రామవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీని మరింత అభివృద్ధి చేయడం పార్టీలో ఉన్న అందరి లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. బుధవారం చవిటిదిబ్బలు గ్రామంలో జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడు కోళ్లబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన మండల టీడీపీ అధ్యక్షుడిగా పొత్తూరు కాంతారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఉపాధ్యక్షుడిగా గొర్లె దుష్యంతుడు, కార్యదర్శి చిన్నాల దొర, ఇతర కమిటీ సభ్యులను ఎమ్మెల్యే, మా జీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ రమణారెడ్డి సత్కరించారు. పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరకా వెంకటరమణ, మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మి, సీనియర్ నేత రెడ్డి సత్యనారాయణ, కుప్పా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

దేవీపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రామన్నపాలెంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను బుధవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున అండగా ఉంటామన్నారు. అవసరమైన ప్రభుత్వ సౌకర్యాలు అందిస్తామన్నారు. ప్రమాదంలో నిరాశ్రయులైన కుక్క అప్పయ్యమ్మ, కుక్క వెంకటేశ్వరరావు కుటుంబాలకు ఎమ్మెల్యే బియ్యం, కూరగాయలు, ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోళ్ల చంటిబాబు, ముండ్రు మధుసూదనరావు, తైలం గంగాధరం, జొన్నల శ్రీనివాస్‌కుమార్, జొన్నల రాంబాబు, సర్పంచ్ కుంజం రాజామణి, కొత్తపల్లి అన్నవరం, రేలంగి రాంబాబు, పోశమ్మ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో సాల్మన్‌రాజు, కార్యదర్శి రాంబాబు, ఉదయ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మండలంలోని శరభవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్.రామన్న పాలెం గ్రామంలో అగ్నిప్రమాదంలో దగ్ధమైన రెండు ఇళ్ల కుటుంబాలకు ఎంపీటీసీ తుర్రం జగదీష్‌దొర ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కమిటీని ఏర్పాటుచేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రంపచోడవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిశారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయాలని, పోలవరం ముంపు గ్రామాలన్నింటినీ మొదటి ప్ర యార్టీ జాబితాలో చేర్చి ఒకే దఫాగా పునరావాసం కల్పించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు బొప్పెన కిరణ్, మట్ల వాణిశ్రీ, నడిపూడి వెంకటరెడ్డి, కారం సోమరాజుదొర, తాళ్లూరు వీరభద్రారెడ్డి, చారపు సుభాషిణి, శివరామకృష్ణ మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

విద్యార్థులతో నులిపురుగు నివారణ మాత్రలు మింగించాలి

రంపచోడవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులచే నులిపురుగు నివారణ మాత్రలు తప్పక మింగించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. బుధవారం ఆయన కార్యాలయ ఛాంబరు నుంచి నులిపురుగుల నివారణమాత్రలు పంపిణీపై వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈనెల 12న అన్ని అంగన్వాడీ, పాఠశాల విద్యార్థులకు మాత్రలను మింగించాలన్నారు. అంగ న్వాడీ కేంద్రాలలో బాలబాలికలకు సగం ముక్క కాచి చల్లార్చిన నీటిలో కరగబెట్టి తాగించాలన్నారు. జ్వరాలతో ఉన్న విద్యార్థులు 15రోజుల తర్వాత మా త్రలు మింగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, వైద్యాధికారి కేవిన్‌బాబు పాల్గొన్నారు.

'తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయం'

అడ్డతీగల, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో తక్కువ పెట్టుబడులతో మేలు రకమైన పంటలను పండించడానికి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాధ్యపడుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రామ్మోహనరావు వ్యవసాయ సిబ్బందికి సూచించారు. దీనికోసం ప్రత్యేక ప్రణాళికతో మూడు రోజులపాటు వేటమామిడి రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ విస్తరణ అధికారులకు, వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణా ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో పొందుపరిచిన సూచనలను. వివరాలను వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరిం చాలన్నారు. రంపచోడవరం వ్యవసాయ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం అను సంధానంతో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ముం దుకు తీసుకొనివెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏడు మండలాల వ్యవసాయ సిబ్బంది, గంగవరం వ్యవ సాయ అధికారి విశ్వనాథ్, గ్రామ వ్యవసాయ సహా యకులు, గ్రామ ఉద్యానవన సహాయకులు ఎస్.ఎఫ్. ఏ.లు ఎం.ఎం.టీ.ఎల్, ఎంటీలు, యూనిట్ ఇన్ చార్జిలు పాల్గొన్నారు.

రహదారుల కల్వర్టు పనులకు శ్రీకారం

ఎటపాక, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండ లం, గౌరిదేవిపేట గ్రామంలో బుధవారం సీసీ రహ దారుల కల్వర్టు పనులకు శ్రీకారంచుట్టారు. వైస్ ఎంపీపీ దొంతుమంగేశ్వరరావు కల్వర్టు పనులను ప్రారంభించారు. కల్వర్టులవద్ద సిమెంట్ పైపులు వేసి, కాంక్రీట్‌తో నిర్మాణం చేపట్టారు. ఇదేకాక అం తర్గత సీసీ రహదారులు అనుసంధానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నా యకులు ఆకుల కొండయ్య, ముక్కెర భద్రరావు, అమరవరపు రాము, బొల్లా పుల్లయ్య, మల్లెల లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగ రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలి

రంపచోడవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు ఉద్యోగాల్లో నూరు శాతం రిజర్వేషన్లతో పాటు ప్రత్యేక డీఎస్సీపై స్పష్టమైన ప్రకటన చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రధాన కార్యదర్శి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మార్క్స్-ఎంగెల్స్ భవనంలో డివిజన్ నాయకుడు కత్తుల బాలురెడ్డి అధ్యక్షతన ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా దూలయ్య మాట్లాడుతూ ఆది వాసీలకు ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సహాయ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో బాక్సైట్ తవ్వకాల ఆలోచన, పాపికొండల నేషనల్ అభయారణ్యంలో ఏకో సెన్సిటివ్ పార్కుల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆదివాసీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌పీ ఫంక్షన్‌హాల్లో నిర్వహించే బహిరంగ సదస్సును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమానికి ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా హాజరై ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ, పీవైఎల్, పీవోడబ్ల్యు డివిజన్ కార్యవర్గ సభ్యులు పల్లాల అనసూయ, పి.ఆదిలక్ష్మి, ఐ.వి.రమణ, మడకం జోగమ్మ, కత్తుల సుగ్గిరెడ్డి, చెదల మాధవరెడ్డి, కె.బాలుదొర, అన్నిక పండమ్మ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నేపథ్యంలో ప్రభుత్వం ఏజేన్సీ ప్రాంతంలో గిరిజనులకే 100శాతం రిజర్వేషన్‌పై ప్రకటన చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు, ఆదివాసీ జేఏసీ నాయకులు వంతు బాలకృష్ణ, వజ్రపు అప్పారావు డిమాండ్ చేశారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి



చైర్మన్‌గా సంతకం చేస్తున్న దాసం శేషారావు

ప్రత్తిపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థ బలోపేతానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి చెప్పారు. ధర్మవరం గంగాలమ్మ గుడి సమీప ప్రాంగణంలో బుధవారంధర్మవరం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా దాసంశేషారావు, సభ్యులుగా సి.అప్పలరాజు, పంపనబోయిన తాతాజీలతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి రైతుల శ్రేయస్సు కోసం పాలకవర్గం పాటుపడాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తోడ్పాటునందించాలన్నారు. తుమ్మల మాట్లాడుతూ జిల్లాలో రుణాలు 50శాతం రికవరీ ఉన్న సొసైటీలకు తిరిగి రుణాలు పెద్ద ఎత్తున మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. చైర్మన్, పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, సొసైటీల చైర్మన్‌లు వరుపుల రామకృష్ణ, సత్యంశెట్టి సీతారాం, పెంటకోట విజయ్, ఇళ్ల అప్పారావు, బొండాడ నారాయణనుడు, ఊటా వీరబాబు, సింగిలిదేవ్ సత్తిరాజు పాల్గొన్నారు.

'లోవ'లో యనమల రాజేష్ పూజలు

తునిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవలో తుని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు రాజేష్‌కు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగంపేట రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇంచార్జ్ మరోతి శివ గణేష్ సోదరుడు గోపాలరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను భలభద్రపురం గ్రామంలో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. మాదారపు వీరబాబు, కాయలు మణికంఠ, గంధం సిద్దేశ్వరరావు, పాలెం బాబు ఉన్నారు

విద్యార్థులకు నగదు బహుమతులు

తునిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు తుని బ్రాంచ్ నగదు బహుమతులు అందజేశారు. షేర్ హోల్డర్ పిల్లలకు పదోతరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారికి బ్యాంకు యాజమాన్యం నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. ఒక్కొక్క విద్యార్థికి రూ.5వేలు చొప్పున 23మందికి రూ.7500 చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. జోనల్ మేనేజర్ ఠాగూర్, డైరెక్టర్లు సి.కృష్ణమోహన్, నామన కామరాజు, రావు జగ్గారావు, మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. 10పరిశ్రమల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. 241మంది హాజరుకాగా 80మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికచేసి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తునిరూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల9,10తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు తుని రాజా గ్రౌండ్‌లో బుధవారం కాకినాడ జిల్లా ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కాకినాడ జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు, రాష్ట్ర ఆట్యాపాట్యా అధ్యక్షులు కెఎస్ జాబ్స్ హాజరయ్యారు. జూనియర్స్ బాయ్స్ టీంకి ఆర్.ఆనందకుమార్, ఎ.అరవింద్, పి.సాయి, ఎస్.మహేష్, బి.నాగచైతన్యం, ఎల్.జి.శ్యామ్, ఎ.హేమంత్‌సాయి, ఎస్.హరీష్, ఎ.సందీప్, బి.మనోజ్ కుమార్, డి.తేజసందీప్, కె.కృష్ణవంశీ... బాలికల జట్టుకి కెఎస్.లక్ష్మీపూజ, పి.ఆర్ఎస్ఎల్ గంగాదేవి, సిహెచ్ ఉమాశైలేంద్రి, డి.రమాదేవి, కె.రోహిణి, డి.గంగాలక్ష్మి, ఎం.దుర్గాభవాని, జి.దక్షిత, బి.అంజలి, వై.కీర్తి ఎంపికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జి.విక్టర్‌బాబు, పి.ప్రశాంత్‌కుమార్, డి.వరలక్ష్మి, ఎం.శ్రీనుబాబు, గోపి, వెంకట్, సతీష్ ఉన్నారు.

ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులను సత్కరించిన నాయకులు

కిర్లంపూడి,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల మండలంలో సేవలందించిన గెద్దనాపల్లి పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, సురేష్, సచివాలయ ఉద్యోగులకు బుధవారం సన్మానం నిర్వహించారు. పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ పంతం సీతారామ నెహ్రూ అధ్యక్షతన సర్పంచ్ మొల్లేటి గంగాభవాని గంగాధర్ ఆధ్వర్యంలో ఉద్యోగులకుశాలువాకప్పి పూలమాలలు వేసి మెమెంటో అందజేశారు. బీశెట్టి శివాజీ, నామన నాగేశ్వరరావు, పంతం దాసు, బిరిసి రాజేష్, జ్యోతుల దొరబాబు, దాడి త్రిమూర్తులు, కార్యదర్శి రమణ, ఇనకోటి గంగాధర్ ఉన్నారు.

సూక్ష్మ పోషకాల లోపాలు గుర్తించాలి



మాట్లాడుతున్న ఏవో

శంఖవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో సూక్ష్మ పోషకాల లోపాలని గుర్తించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. శంఖవరంలో ప్రత్తి, ఇనుము వంటి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు.

పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రోన్లతో నిఘా : సీఐ

తునిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలవద్ద డ్రోన్లతో నిఘా పెట్టామని తుని టౌన్ సీఐ ఎం.గీతా రామకృష్ణ అన్నారు. బుదవారంపాఠశాలలు, కళాశాలల వద్ద డ్రోన్‌తో పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులను గుర్తించడం, శాంతి భద్రతల పర్యవేక్షణకు డ్రోన్ కెమెరాను ఉపయోగిస్తున్నామన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

తునిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తుని 23వ వార్డులోని ఆదర్శకాలనీ, గవరపేటలో రూ.10లక్షలతో బీపీఎస్ నిధులతో రోడ్లు, కల్వర్లు, డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి బుదవారం ప్రారంభించారు. పట్టణాభివృద్ధే తమ లక్ష్యమని తెలిపారు. కుసుమంచి శోభారాణి, కర్రి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతోన్న విద్యార్థులు జి.అవినాష్‌కుమార్, ఎ.శివశంకర్, పి.చరిత్‌గుప్త, జి.శివ, ఎల్.జ్యోతి, పి.కావ్య, డి.నాగేశ్వరి, కె.దినేష్ ఈనెల3న పెద్దాపురంలో జరిగిన కాకినాడ జిల్లా అండర్ 18 అథ్లెటిక్స్ సెలక్షన్స్ పోటీల్లో ప్రతిభ కనపరిచారు. ఈనెల9,11 తేదీల్లో చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ఆదిత్య ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్‌లు బి.అనిల్‌గౌతమ్, మురళీమోహన్‌ను అభినందించారు.

టీడీపీ మండల ఉపాధ్యక్షుడిగా శ్రీనుబాబు



గండేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల ఉపా ధ్యక్షుడిగా సుబ్బయ్యమ్మపేట గ్రామానికి చెందిన బొండా శ్రీనుబాబును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎన్నిక చేశారు. శ్రీనుబాబు మాట్లాడుతూ తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. శ్రీనుబాబుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

తల్లి పాల వారోత్సవాలు

గండేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మురారి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో పూర్ణిమ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇస్తే బిడ్డ జీవితాంతం పూర్తి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఉపసర్పంచ్ జాస్తి వసంత్ తల్లి మంగ ఐదుగురు గర్భిణులకు సీమంతం చేశారు.

గాంధీసత్రం పాలకవర్గం ఖరారు

తునిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ సత్రం పాలకవర్గాన్ని బుధవారం ఎమ్మెల్యే యనమల దివ్య ప్రకటించారు. తొమ్మిది మందితో పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గాంధీ సత్రం చైర్మన్‌గా కుండల రామకృష్ణ, సభ్యులుగా నెల్లిపూడి బ్రహ్మాజీ, దంతలూరి వెంకటశివరామకృష్ణరాజు, కోడూరి శివసురేష్, నూకల రమేష్, ఆడారి పద్మావతి, కాకాడ చిన్నారి, గెడ్డమూరి సుభాషిణి, చల్లపల్లి లక్ష్మి ఎంపికయ్యారు.

టీడీపీ మండల కమిటీ సభ్యులకు సత్కారం

గండేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీ సభ్యులను బుధవారం సత్కరించారు. టీడీపీ గండేపల్లి అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ మండల కమిటీలో గండేపల్లి టీడీపీ నాయకులకు స్థానం కల్పించినందుకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, కోర్పు సాయితేజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీలో పదవులు పొందిన సుంకవిల్లి రమేష్, పసుమర్తి సుబ్రహ్మణ్యం, సమ్మంగి శ్రీదేవి, చుండ్రు బ్రహ్మారాజు, వెంపాటి పట్టాభిరామయ్య, కొమ్ము కూరి శ్రీను, కోసూరి వెంకటరమణను సత్కరించారు.

భావారంలో డెంగ్యూ జ్వరాలు

జగ్గంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం భావారంలో డెంగ్యూ జ్వరాలు అధికమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డెంగ్యూ జ్వరాలతో మంచానపడిన వాపదిలం హనీ, కె.బాబాజీ, పల్లాల లోవకుమారి, పులిగే రాజులు ఆసుపత్రుల్లో చేరి 10 రోజులు తరువాత ఇంటికి చేరుకున్నారు. మళ్లీ 10 మంది వరకు ఈ గ్రామంలో జ్వరాల బారిన పడడంతో వారిని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. తక్షణం వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరాల బారినపడిన వారి రక్తనమూనాలు పరీక్షించి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.

తుని రైల్వే స్టేషన్ సమస్యలపై జీఎంకు వినతి



తుని రైల్వేస్టేషన్‌లో సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

తునిరూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వేస్టేషన్‌లోని సమస్యలను పరిష్కరించాలని రైల్వే జెడ్ఆర్‌యుసీసీ మెంబర్ బోడపాటి శ్రీను బుధవారం తుని రైల్వేస్టేషన్ పరిశీలనకు వచ్చి రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్ ప్రయాణికులకు రిటైనింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలని, వందేభారత్, ముంబై ఎల్టీటీ, ఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌కు తునిలో హాల్ట్ కల్పించాలని, రెండో నెంబరు ప్లాట్‌ఫారంపై మరో టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాట్‌ఫామ్స్‌పై టాయిలెట్స్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

నేడు ధర్మవరంలో పార్కు ప్రారంభం



పార్కు ముఖ ద్వారం

ప్రత్తిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో 4 ఎకరాల స్థలంలో సుందరంగా పార్కు నిర్మాణాన్ని పూర్తి చేశారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి ఆధ్వర్యంలో రూ.11లక్షలతో ఈ పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేశారు. పార్కు మధ్యలో ఫౌంటెన్ ఏర్పాటు చేసి మధ్యలో ప్రత్యేక కట్టడం నిర్మించి బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేశారు. పార్కు చుట్టూ ఫెన్సింగ్, రాత్రి సమయాల్లో కూడా వెలుతురులో వాకింగ్ ట్రాక్‌లో నడిచేలా విద్యుదీకరణ పూర్తి చేశారు. బెంచీలు, మంచినీరు ట్యాంకులు ఏర్పాటు చేశారు. గురువారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పార్కును ప్రారంభించనున్నారు.

ఉలిగోగులలో నేడు కలెక్టర్ పర్యటన



ధ్వంసమైన ఉలిగోగుల పాఠశాల భవనం

ప్రత్తిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలోని ఎత్తైన కొండపై ఉన్న బురదకోట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఉలిగోగుల గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామంలో 100 మందికి పైగా జనాభా ఉండగా అంగన్‌వాడీ కేంద్రం కూడా ఏర్పాటు కాలేదు. ఇక్కడ ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు గురైంది. ఉలిగోగుల నుంచి మెట్టిచింత గ్రామం వరకు ఉన్న గ్రామ రహదారి అభివృద్ధి జరగలేదు. లో ఓల్టేజ్ సమస్య అధికంగా ఉండడంతో మంచినీటి పథకాలు పని చేయక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో వైద్య సౌకర్యాలు అందడం లేదని గిరిజనులు వాపోతున్నారు. తమ సమస్యలపై ఇటీవల గిరిజనులు కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేయడంతో గురువారం ఆయన ఉలిగోగుల గ్రామం సందర్శించేందుకు వస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ద్వారా గిరిజనులకు అమలయ్యే సంక్షేమ పథకాలు అందేలా చూడాలని వారు కలెక్టర్‌ను కోరుతున్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి'

ఎటపాక, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.స్వప్నకుమారి అన్నారు. బుధవారం నెల్లిపాకలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కా రానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు, జిల్లా ఇంచార్జ్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఇటీవల అనారోగ్యం బారినపడిన పార్టీ సీనియర్ నాయకుడు భాస్కర్‌రావు, ఉమాశంకర్‌లను పరామర్శించారు.

స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

ప్రత్తిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్, జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్, ఈఎస్‌టీఎఫ్ బృందాలు బుధవారం ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో దాడులు జరిపి, బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పెదమల్లాపురంలో 20లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆకుల నాగబాబును అరెస్ట్ చేశా రు. సీతంపేటలో ఎద్దు మంగను, కత్తిపూడిలో మహిళను అరెస్ట్ చేశారు. ధర్మవరంలో మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ కూడా పాల్గొన్నారు.

నాసిరకం కోడిగుడ్లు ధ్వంసం

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశమైన సీడీపీవో పద్మావతి

ప్రత్తిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకపల్లిలో అంగన్‌వాడీ కేం ద్రం ద్వారా లబ్ధిదారులకు నాసిరకం కోడిగుడ్లపై వచ్చా యంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చి న కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ కృష్ణవేణి వాకపల్లి వెళ్లి 14 కుటుంబాలకు సరఫరా అయిన నాసిరకం కోడిగుడ్లను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. అనంతరం కాంట్రాక్టర్ల నుంచి నాణ్యత కలిగిన గుడ్లను లబ్ధిదారులకు సరఫరా చేశారు. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీడీపీవో పద్మావతి సమావేశం నిర్వహించారు. సీడీపీవో వాకపల్లి, గజ్జినపూడి అంగన్‌వాడీ కార్యకర్తలకు చార్జ్ మెమో జారీ చేసినట్టు తెలిపారు. 3వ ఫేజ్‌లో లబ్ధిదారులకు సరఫరా అయిన గ్రీన్ రకం కోడిగుడ్లను లబ్ధిదారులు ఆలస్యంగా వినియోగించడం వల్లే అవి పాడైనట్లు గుర్తించామని సీడీపీవో పద్మావతి గుర్తించారు.